# దళితబంధుతో పెట్రోల్ బంక్

మొదటిపేజీ తరువాయి...

ఆదేశాలతో కలెక్టర్ ఈ పథకం అమలుకు చర్యలు చేపట్టారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. పదిరలోని దళితకాలనీలో సర్వే చేసి, 23 కుటుంబాలను లబ్ధిదారులుగా గుర్తించారు. గతేడాది జనవరిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆలోచన మేరకు ట్రాక్టర్లు, వాహనాలు కాకుండా ఇతర శాశ్వత లబ్ధిని పొందే యూనిట్లను తీసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టర్ అనురాగ్ జయంతి పలు శాఖల అధికారులతో లబ్ధిదారుల కుటుంబాలకు గతేడాది జనవరి 25న అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా తొమ్మిదిమంది లబ్ధిదారులు తెడ్డు పద్మ (బీడీ కార్మికురాలు), తెడ్డు ఎల్లవ్వ (వ్యవసాయ కూలీ), తెడ్డు దేవేంద్ర (బీడీ కార్మికురాలు), తెడ్డు ప్రమీల (దినసరి కూలీ), తెడ్డు లక్ష్మి (దినసరి కూలీ), తెడ్డు బాల్‌లక్ష్మి (బీడీ కార్మికురాలు), రుద్రారపు సతీశ్ (ట్రాక్టర్ డ్రైవర్), జెడల ఎల్లవ్వ (దినసరి కూలీ), పత్రి రాజవ్వ (దినసరి కూలీ) కలిసి పెట్రోలు బంకు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా, చొరవతీసుకుని నయారా బంకు



పదిరలో లబ్ధిదారులతో కలిసి 'దళితబంధు' పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్

ఏర్పాటుకు సదరు కంపనీ ప్రతినిధులతో మాట్లాడారు. ఇందుకోసం ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున రూ.90 లక్షలు మంజూరయ్యాయి. ఎస్బీఐ, ఇతర వనరుల ద్వారా మరో రూ.80 లక్షలు రుణం తీసుకున్నారు. మొత్తం రూ.1.70 కోట్లు సమకూర్చుకున్నారు. బంకు కోసం కామారెడ్డి-కరీంనగర్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న 20 గుంటల స్థలాన్ని నెలకు రూ.17,500కు లీజుకు తీసుకొని పెట్రోలు బంకు ఏర్పాటు చేసుకున్నారు. అక్టోబర్ చివరి వారంలో పనులు పూర్తయినప్పటికీ ఎన్నికల కోడ్ కారణంగా బంకు ప్రారంభం వాయిదా పడింది. కాగా, ఈ పెట్రోలు బంకును బుధవారం కేటీఆర్ ప్రారంభించారు.

### ఏండ్లసంది జీతగాడిని.. ఇప్పుడు ఓనరైన



నేను 15 ఏండ్ల సంది ఊళ్లే ట్రాక్టర్ డ్రైవర్‌గా జీతం ఉండి బతికిన. కేసీఆర్ సారు జెయ్యవట్టి నాకు దళితబంధు వచ్చింది. మా ఊరోళ్లం తొమ్మిది మంది కలిసి పెట్రోలు పంపు పెట్టుకున్నం. మొన్నటిదాకా జీతానికి పనిచేసిన నేను ఇప్పుడు బంకుకు ఓనరైన. కేసీఆర్ సార్ రుణం ఎప్పటికీ మర్చిపోలేను.

**-రుద్రారపు సతీశ్, దళితబంధు లబ్ధిదారు, పదిర**

### ఇగ కొడుకు దుబాయ్ పోడు..




ఉన్న ఊళ్లే బతుకుదెరువు లేక కొడుకులు దేశాలు పట్టుక తిరిగే పరిస్థితి మాది. పోయిన ఏడాది కేసీఆర్ సార్ దళితబంధు కింద రూ.10 లక్షలు ఇస్తరట అని అందరు సెప్పితె నమ్మలే. మాకు మా ఊర్లె అందరికీ దళితబంధు పైసలు ఇచ్చిర్రు. ఇగ మా మల్లారెడ్డి సారు (సెస్ మాజీ డైరెక్టర్) తొమ్మిది మంది గలిసి పెట్రోలు బంకు పెట్టుకోర్రి మంచిగుంటదని చెప్పిండు. పెట్రోలు బంకు పెట్టినంక ఇక్కన్నే బంకుల పనిజేసుకుంట ఉన్నడు. ఇగ కొడుకు దుబాయ్‌కి పోడు. మాకు సాయం జేసిన కేటీఆర్ సారును మరిచిపోము.

**- తెడ్డు ప్రమీల, దళితబంధు లబ్ధిదారు, పదిర**



## టీఎస్ఐఐసీ ఎండీగా శ్రీధర్

హైదరాబాద్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఈ శ్రీధర్ బుధవారం బషీర్‌బాగ్‌లో పరిశ్రమల భవన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా టీఎస్ఐఐసీ వీసీ, ఎండీగా ఉన్న నర్సింహారెడ్డిని ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. కాగా, ఆయన స్థానంలో శ్రీధర్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.



## ప్రజల ఆశలకు అనుగుణంగా పనిచేయాలి

- సివిల్ సప్లయీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్
- బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): ప్రజల ఆశలకు అనుగుణంగా, వారి సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేయాల్సిన అవసరం ఉన్నదని పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆ శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ సూచించారు. ఎర్రమంజిల్‌లోని పౌరసరఫరాల భవన్‌లో కమిషనర్‌గా నూతన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, బాగా పనిచేస్తే అవకాశాలు వాటంతటవే వస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా మూడున్నరేండ్లుగా పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా పనిచేసిన అనిల్‌కుమార్‌కు ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు.



కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఆందోళన చేస్తున్న దళిత ఐక్యవేదిక నాయకులు

## దళితబంధు రెండో విడత నిధులు ఇవ్వాలి

- దళిత ఐక్య వేదిక నేతల డిమాండ్
- జమ్మికుంటలో ఆందోళన

జమ్మికుంట, డిసెంబర్ 27: దళితబంధు లబ్ధిదారులకు రెండో విడత నిధులు మంజూరు చేయాలని దళిత ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. దళిత ఐక్య వేదిక హుజూరాబాద్ నియోజకవర్గ నేత మంద రాజేశ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం దళిత బంధు పథకం ప్రవేశపెట్టి లబ్ధిదారులను ఎంపిక చేసిందని తెలిపారు. యూనిట్ల ఎంపిక తర్వాత మొదటి విడత కింద సగం డబ్బులు రూ.5 లక్షలు విడుదల చేశారని, ఎన్నికల కోడ్ వచ్చిందంటూ మిగితా డబ్బులు ఇప్పటివరకు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసినా డబ్బులు ఎందుకు విడుదల చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు.



ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలం గోలేటిలో ఏఐటీయూసీ నాయకుల సంబురాలు


## సింగరేణిలో ఏఐటీయూసీ విజయం

- గుర్తింపు సంఘం ఎన్నికల్లో హవా

గోదావరిఖని, డిసెంబర్ 27 : సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీపీఐ అనుబంధ సంఘమైన ఆలిండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (ఏఐటీయూసీ) జయకేతనం ఎగురువేసింది. 11 డివిజన్లలో 5 చోట్ల ప్రాతినిధ్య సంఘంగా గెలిచినా.. అత్యధిక ఓట్లతో గుర్తింపు సంఘంగా విజయం సాధించింది. కాంగ్రెస్ అనుబంధ సంఘమైన ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) ఆరు చోట్ల ప్రాతినిధ్య సంఘంగా గెలిచినా.. గుర్తింపు సంఘంగా గెలువలేకపోయింది. రామగుండం-1, ఆర్జీ-2, బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్‌లో ఏఐటీయూసీ, ఆర్జీ-3, భూపాల్‌పల్లి, కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం కార్పొరేట్‌లో ఐఎన్‌టీయూసీ గెలిచింది.

## ప్రపంచం మెచ్చిన హైదరాబాద్ బిర్యానీ

### 'టేస్ట్ అట్లాస్'లో 39వ స్థానం



సిటీబ్యూరో, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ బిర్యానీకి ఉన్న క్రేజే వేరు. మన దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మన బిర్యానీకి ఆహార ప్రియుల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. మొన్న స్విగ్గీలో అత్యధిక ఆర్డర్లు పొందిన ఆహార పదార్థంగా మన బిర్యానీ రికార్డులకెక్కిన సంగతి తెలిసిందే. తాజాగా 'ట్రావెల్ గ్లోబల్.. ఈట్ లోకల్' అంశంతో పనిచేసే ప్రముఖ ప్రపంచ పర్యాటక ఆన్‌లైన్ గైడ్ 'టేస్ట్ అట్లాస్' ప్రకటించిన ఉత్తమ ఆహార పదార్థాల జాబితాలో కూడా మన హైదరాబాద్ బిర్యానీ చోటు సంపాదించుకుంది. సదరు సంస్థ వివిధ దేశాలకు చెందిన నగరాలు, అక్కడి ఆహారపదార్థాలపై సమీక్ష చేసి ఈ స్థానాలను ప్రకటించింది. అందులో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా టాప్ 50 నగరాల్లో హైదరాబాద్ 39వ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం. ముంబై 35వ స్థానం, ఢిల్లీ 56, చెన్నై 65, లక్నో 92వ స్థానంలో నిలిచాయి. ఆహార పదార్థాల జాబితాలో అగ్రస్థానంలో ఇటలీ వంటకాలు నిలిచినట్టు ఆ సంస్థ ప్రకటించింది. మన దేశ ఆహార పదార్థాల్లో పావ్ భాజీ, దోశ, వడాపావ్, కబాబ్స్, పానీపురి, బిర్యానీలను అధికంగా ఇష్టపడుతున్నట్టు పేర్కొంది. మన హైదరాబాద్ విషయానికొస్తే బిర్యానీకే టేస్ట్‌ఫుడ్ అట్లాస్ జై కొట్టింది.

## తల నరికితే రూ.కోటి

- కొలికపూడి వ్యాఖ్యలపై దర్శకుడు ఆర్జీవీ ఆగ్రహం
- ముగ్గురిపై ఏపీ డీజీపీకి ఫిర్యాదు



హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): తన తలను ఎవరైనా నరికి తీసుకొస్తే రూ.కోటి ఇస్తానంటూ ఓ న్యూస్ చానల్ డిబేట్‌లో బహిరంగంగా వ్యాఖ్యానించిన అమరావతి పరిరక్షణ సమితి జేఏసీ కన్వీనర్ కొలికపూడి శ్రీనివాసరావుపై ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్‌కు దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ఫిర్యాదు చేశారు. 'వ్యూహం' నిర్మాత, వైసీపీ నాయకుడు దాసరి కిరణ్‌తో కలిసి బుధవారం సాయంత్రం డీజీపీని కలిశారు. మంగళవారం రాత్రి టీవీ డిబేట్‌లో కొలికపూడి శ్రీనివాస్ తనను చంపితే రూ.కోటి ఇస్తానని చెప్పడం.. దాన్ని యాంకర్ మూడు సార్లు రిపీట్ చేయడం.. లైవ్‌లో కూర్చొని సుపారీ ఇవ్వడం.. తన ఇంటికొచ్చి తనను తగులబెడతానని చెప్పడం దారుణమని చెప్పారు. హత్యారాజకీయాలను నివారించాలని డీజీపీని కోరారు. తన హత్యకు కుట్రపన్నిన కొలికపూడి శ్రీనివాస్, టీవీ యాంకర్ సాంబశివరావు, చానల్ యజమాని బీఆర్ నాయుడుపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## 'దిశ' కేసులో పోలీసులకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): సంచలనం రేకెత్తించిన దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో ప్రతివాదులుగా ఉన్న పోలీసులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పోలీసుల వాదనలు కూడా విన్న తర్వాతే తుది ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. ఈమేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ బుధవారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. దిశ హత్య కేసులో నిందితులుగా ఉన్న మహమ్మద్ ఆరిఫ్, జొల్లు నవీన్, జొల్లు శివ, చింతకుంట చెన్నకేశవులు ఎన్‌కౌంటర్ అయ్యారు. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ దాఖలైన పలు పిటిషన్లను హైకోర్టు బుధవారం విచారించింది. ఇందులో తమ వాదనలు కూడా వినాలంటూ దిశ తండ్రి, పోలీసులు మధ్యంతర వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. పోలీసులపై ఐపీసీ 302 కింద హత్యా నేరం కేసు నమోదు చేయాలని పిటిషనర్ల తరపు వాదించారు. దర్యాప్తు పూర్తయ్యాక కోర్టుల జోక్యానికి ఆస్కారం లేదని, ఒక ఎఫ్ఐఆర్ దాఖలైన తర్వాత మరో ఎఫ్ఐఆర్ వేయడానికి కూడా వీల్లేదని పోలీసుల తరపు న్యాయవాది వాదించారు. ఇరువాదనలు విన్న తర్వాత హైకోర్టు స్పందిస్తూ, తాజా దర్యాప్తునకు ఆదేశించే హక్కు తమకు ఉన్నదని తెలిపింది. అందుకే ప్రతివాదులుగా పోలీసుల వాదనల నిమిత్తం వారందరికీ నోటీసులు ఇస్తున్నట్టు ప్రకటించిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

